www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -351 ఆదివారం 29 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## మలుపు తిరిగిన యుద్ధం

యుద్ధ క్షేత్రంలోకి హౌతీలు..

ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

సౌదీలో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి

దెబ్బతిన్న రీఫ్యూయలింగ్ విమానాలు..పలువురికి గాయాలు

పోర్టులు, ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా టెహ్రాన్ భీకర దాడులు

**ఢిల్లీ మార్చి28ప్రజావినికిడి**

ఇరాన్ యుద్ధం ఐదో వారంలో ప్రవేశించిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమాసియాలో గత నెల 28న మొదలైన పోరు శనివారం కొత్త మలుపు తిరిగింది. యుద్ధం మొదలైన తర్వాత తర్వాత తొలిసారిగా యెమన్‌కు చెందిన హౌతీలు రంగంలోకి దిగారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌కు దక్షిణాన ఉన్న ఇజ్రాయిల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించారు. లక్ష్యాలను సాధించే వరకూ సైనిక చర్యలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఇరాన్, లెబనాన్, ఇరాక్, పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు ప్రతీకారంగా

మిగతా 2లో.

## మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

అక్రమాలను సహించేది లేదని వెల్లడి

ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం

అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, మార్చి28ప్రజావినికిడి**

మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు.

మిగతా 2లో.

## ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది: ప్రధాని మోదీ

ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధానిమోదీ

ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి

ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన



**ఢిల్లీ మార్చి28ప్రజావినికిడి**

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం

మిగతా 2లో.

## అంగన్వాడీ చిన్నారులకు తొలిముద్ద

బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం

టీచర్లకు మొబైల్ ఫోన్‌ల పంపిణీ



**హైదరాబాద్ మార్చి28ప్రజావినికిడి**

అంగన్వాడీ చిన్నారులకు ఇక నుంచి రెడీ టూ కుక్‌ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్‌ఫాస్ట్‌గా రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ

మిగతా 2లో.

## నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్ట్

గతేడాది జరిగిన జెన్-జీ ఉద్యమం అణచివేత కేసులో చర్యలు

ఖాట్మండు వ్యాప్తంగా ప్రతిపక్ష సీపీఎన్-యూఎంఎల్ నిరసనలు

అరెస్ట్ అనంతరం అస్వస్థతకు గురైన ఓలీ.. ఆసుపత్రికి తరలింపు



**ఢిల్లీమార్చి28ప్రజావినికిడి**

నేపాల్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతన ప్రధాని బాలెన్ షా వచ్చీరావడంతోనే విపక్ష నేతలను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నేత కేపీ శర్మ ఓలీని పోలీసులు శనివారం

మిగతా 2లో.

## ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..



కఠిన నిబంధనల జారీ

ఏపీలో కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలు

విద్యార్థుల ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

రోజుకు 5 గంటలకే పరిమితం.. ఆదివారం తప్పనిసరిగా సెలవు

కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలు

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు

## త్వరలో 'ఈ-చెక్కులు'

డిజిటల్ చెల్లింపుల్లో ఆర్బీఐ విప్లవాత్మక మార్పులు..

డిజిటల్ చెల్లింపుల కోసం ఆర్బీఐ 'పేమెంట్స్ విజన్ 2028' విడుదల




**ఢిల్లీ మార్చి28ప్రజావినికిడి**

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ముందడుగు వేసింది. 'పేమెంట్స్ విజన్ 2028' పేరుతో శుక్రవారం ఒక కొత్త రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ చెక్కుల ప్రవేశం, మోసపూరిత లావాదేవీలపై బ్యాంకుల బాధ్యతను పెంచడం వంటి పలు సంస్కరణలను ప్రతిపాదించింది.

మిగతా 2లో.

## సీఎం బెదిరింపు రాజకీయాలు

మూసీ పేరిట రూ.లక్షన్నర కోట్ల అవినీతి -: మాజీమంత్రి కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్ మార్చి28ప్రజావినికిడి**

రాష్ట్రంలో తన స్కాంలు, అవినీతి గురించి ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. శనివారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారన్నారు. రేవంత్‌రెడ్డికి బెదిరింపులు అలవాటైపోయాయనీ, అలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న అవినీతిపై కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో.



## మూసీకి ఆధ్యాత్మికత

రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం.. శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం

8 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన

మూసీ నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు.. పర్యాటక సౌకర్యాల కల్పన

చారిత్రక ఆలయాలతో కలిపి ఈ ప్రాంతాన్ని 'చిన్న శ్రీశైలం'గా తీర్చిదిద్దే ప్రణాళిక

**హైదరాబాద్ మార్చి28ప్రజావినికిడి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ. 700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు



## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం

ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం



5లో.

## జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

గతంలో ఉమ్మడి ఎపిలో అనేక కార్యక్రమాలు చేపట్టా

వారికి ప్రాధాన్యక్రమంలో భూములు ఇస్తాను

సోషల్ మీడియా వ్యక్తిత్వ హననంపై ఆందోళన

ఐజెయూ సమవేశంలో సిఎం చంద్రబాబు




**అమరావతి,మార్చి28ప్రజావినికిడి**

జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడంలో తానే ముందున్నానని, ఉమ్మడి ఎపిలో అయినా, విభజిత ఎపిలో అయినా అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని సిఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో సోషల్ మీడియా ఓ పెద్ద సవాలుగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు కేవలం అసభ్యకరమైన

మిగతా 2లో.

## ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

**మొదటిపేజీ తరువాయి**

కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు.

ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

## త్వరలో 'ఈ-చెక్కులు'

**మొదటిపేజీ తరువాయి**

వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఆర్బీఐ కీలక సూచనలు చేసింది. ప్రస్తుతం డెబిట్, క్రెడిట్ కార్డులకు మాత్రమే ఉన్న ఎనేబుల్/డిసేబుల్ సదుపాయాన్ని ఇకపై అన్ని రకాల డిజిటల్ చెల్లింపులకు వర్తింపజేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఖాతాదారులు తమ లావాదేవీలపై పూర్తి నియంత్రణ కలిగి ఉండవచ్చు. అంతేకాకుండా, అనధికారిక లావాదేవీలు జరిగినప్పుడు, డబ్బు పంపిన బ్యాంకుతో పాటు స్వీకరించిన బ్యాంకు కూడా ఉమ్మడి బాధ్యత వహించేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాలని యోచిస్తోంది.కొత్త వ్యాపార అవసరాలకు అనుగుణంగా కాగితపు చెక్కుల ప్రయోజనాలను, డిజిటల్ వేగాన్ని కలిపి 'ఈ–చెక్కుల'ను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్బీఐ తన నివేదికలో పేర్కొంది. దీంతోపాటు, చెల్లింపుల వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ–కామర్స్ మార్కెట్ ప్లేస్‌లు, ఇతర సెంట్రలైజ్డ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా తమ ప్రత్యక్ష నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోంది.వీటితో పాటు చెక్కుల భద్రతా ఫీచర్లను సమీక్షించడం, లావాదేవీలను సులభంగా ట్రేస్ చేసేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం, విదేశీ చెల్లింపులను వేగవంతం చేయడం వంటి అంశాలను కూడా ఈ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. ఈ మార్పుల ద్వారా దేశీయ చెల్లింపుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని ఆర్బీఐ స్పష్టం చేసింది.

## నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

**మొదటిపేజీ తరువాయి**

ఉదయం అరెస్ట్ చేశారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన 'జెన్–జీ' యువత ఉద్యమాన్ని అణచివేసిన ఘటనకు సంబంధించిన నరహత్య కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో రాజధాని ఖాట్మండూ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.ఓలీతో పాటు మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్‌ను కూడా భక్తపూర్ జిల్లాలోని వారి నివాసాల నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం ఓలీ అస్వస్థతకు గురికావడంతో, ఆయనను ఖాట్మండూలోని ఓ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓలీ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయన నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కార్యకర్తలు ఖాట్మండూలో ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల టైర్లు కాల్చి, విచారణ కమిషన్ నివేదిక ప్రతులను దహనం చేశారు. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. శుక్రవారం కొలువుదీరిన ప్రధాని బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన తొలి కేబినెట్ సమావేశంలోనే విచారణ కమిషన్ నివేదికను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ అరెస్టులు కక్షపూరితమైనవని, చట్టవిరుద్ధమని యూఎంఎల్ పార్టీ ఖండించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఇదిలా ఉండగా, ఓలీ అరెస్ట్‌ను నేపాల్ మాజీ అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ 'అవివేక నిర్ణయం'గా అభివర్ణించారు. ఈ చర్య దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయవచ్చని, దేశంలో అస్థిరత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అధ్యయనం, న్యాయ ప్రక్రియ లేకుండా నివేదికను అమలు చేయడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మలుపు తిరిగిన యుద్ధం

**మొదటిపేజీ తరువాయి**

యెమన్‌కు ఆవల ఉన్న లక్ష్యాలపై కూడా దాడి చేసే సామర్థ్యం తమకు ఉన్నదని హైతీలు ఈ చర్య ద్వారా నిరూపించుకున్నారు. అరేబియన్ ద్వీపకల్పం, ఎర్ర సముద్రం పరిసరాలలో ప్రయాణించే నౌకలను అడ్డుకునే సామర్థ్యం హౌతీలకు ఉంది. 2023 అక్టోబర్ 7 తర్వాత గాజాలో హమాస్‌కు మద్దతుగా వారు జల రవాణాను అడ్డుకున్న విషయం తెలిసిందే. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు ఉండగా సూయజ్ కెనాల్‌కు దారితీసే బాబ్ అల్–మందబ్ జలసంధిపై హౌతీలకు నియంత్రణ ఉంది.

సౌదీలో దెబ్బతిన్న అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలుపలువురికి గాయాలు

గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడులను ఇరాన్ ముమ్మరం చేసింది. సౌదీ అరేబియాలోని కీలక అమెరికా స్థావరంపై ఆరు క్షిపణులు, 29 డ్రోన్లతో శుక్రవారం పెద్ద ఎత్తున దాడి జరిపింది. ఈ దాడిలో పదిహేను మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దాడిలో అనేక అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడి చేసిందని అమెరికా అధికారి ధృవీకరించారు.

యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ దాడి చేయడం ఇది రెండోసారి. కాగా ఒమన్ తీరంలో ఉన్న అమెరికా నౌకపై ఇరాన్ దళాలు శనివారం ఉదయం దాడి చేశాయి. ఒమన్ తీరంలో దాడి జరిగినప్పటికీ ఆ దేశం యొక్క సార్వభౌమత్వాన్ని పూర్తిగా గౌరవిస్తూనే ఈ చర్యకు దిగామని ఖతమ్ అల్–అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి అబ్రహం జోల్ఫగనీ తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

'తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరం. దీనిని ఎలా నియంత్రించాలో, ప్రజలను ఎలా చైతన్యపరచాలో మనమందరం ఆలోచించాలి. రాబోయే ఒకటి రెండేళ్లలో 3వ స్థానానికి, 2038 నాటికి 2వ స్థానానికి, 2047 లేదా 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగే అవకాశముందని సీఎంచంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే గతంలో హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లకు, జర్నలిస్టులకు విలువైన ప్రాంతాల్లో భూములిచ్చామన్నారు. అమరావతిలోనూ పాత్రికేయుల నివాసాల కోసం భూమి కేటాయించేందుకు సానుకూలంగా పరిశీలిస్తామని భరోసానిచ్చారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం సహా జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని పది లక్షల రూపాయలకు పెంచామని.. డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకూ అక్రిడిటేషన్, బస్సు ప్రయాణ రాయితీలు కల్పించామని చెప్పుకొచ్చారు. అమరావతిలో భూమి మానిటైజేషన్ ప్రాజెక్ట్ అయినప్పటికీ.. ఓ పద్ధతి ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకుంటాం. గతంలో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలే తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి సొంత పత్రికలను కలిగిఉండేవి. కానీ.. నేడు రాజకీయ నాయకులే స్వయంగా మీడియా సంస్థలను నడుపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన ధోరణి. వృత్తిపరమైన మీడియా, రాజకీయ పార్టీల యాజమాన్యంలోని మీడియాల మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నేను కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని ఈ సందర్భంగా స్మరించుకున్నారు చంద్రబాబు. కరెంటులేక పొలాలు ఎండిపోతున్నాయని తాను అసెంబ్లీని వాయిదావేసి మరీ క్షేత్రస్థాయికి వెళ్లిన రోజులు గుర్తున్నాయన్నారు. '90వ దశకం చివరలో నేను విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాను. దేశం కోసం, రాష్ట్రం కోసం నేను విద్యుత్ తీసుకొచ్చినా.. దురదృష్టవశాత్తూ 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఎప్పుడూ కలిసే సాగాలి. నేడు సమాజంలో విలువలు పడిపోవడం, సిద్ధాంతాలు మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ.రామారావును ఒకసారి 'మీరు కమ్యూనిజమా, సోషలిజమా లేక క్యాపిటలిజమా?' అని అడిగితే.. తానొక 'ఉత్తమ మానవతావాదిని' అని ఆయన సమాధానమిచ్చారు' అని ముఖ్యమంత్రి నాటి జ్ఞాపకాలను గురించి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి ఏపీ సీఎం మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామంటే నాడు అందరూ నవ్వుకున్నారు. కానీ పాతికేళ్ల తర్వాత నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్లలో 25 శాతం హైదరాబాద్‌కే వస్తున్నాయి. రాష్ట్ర విభజన కంటే కూడా 2019 నుంచి 2024 మధ్య జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోయింది. మళ్లీ మనం అశ్రద్ధ చేస్తే, సమస్యలు వస్తాయనే విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మూడు రాజధానులని మాట్లాడారు. కొంతవరకు మీడియా అంతా కూడా దీనిని ఖండించారు, అయినా పట్టించుకోలేదని చంద్రబాబు చెప్పారు.

.

# మూసీకి ఆధ్యాత్మికత



**మొదటిపేజీ తరువాయి**

. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.

శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం.

ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు.

ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


# ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..

## కఠిన నిబంధనల జారీ

**అమరావతిమార్చి28ప్రజావినికిడి**

ఏపీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ 'ఏపీ కోచింగ్ సెంటర్ల నియంత్రణ, పర్యవేక్షణ నిబంధనలు–2026' పేరుతో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే నడుస్తున్న కేంద్రాలు కూడా మూడు నెలల్లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో విద్యార్థులపై ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. కొత్త నిబంధనల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీయే కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్లు మంజూరు చేయడం, విద్యార్థుల



నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం వంటి బాధ్యతలు చూస్తుంది. అంతేగాక మీడియా కథనాలు లేదా పోలీసు రిపోర్టుల ఆధారంగా సుమోటోగా తనిఖీలు చేసే అధికారాన్ని కూడా ఈ కమిటీకి కల్పించారు.

కొత్త నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లు రోజుకు గరిష్ఠంగా ఐదు గంటలు మాత్రమే పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలలు నడిచే సమయంలో కోచింగ్ తరగతులు నిర్వహించకూడదు. ఆదివారం తప్పనిసరిగా సెలవు ప్రకటించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ప్రతి కేంద్రంలో ఒక వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, కౌన్సిలింగ్ అందించాలి. ఆత్మహత్యలను నివారించేందుకు స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

**ఫీజు తిరిగివ్వాలి.. సర్టిఫికెట్లు తీసుకోవద్దు**

ఫీజుల విషయంలో విద్యార్థులను వేధించకూడదని, ఒకవేళ విద్యార్థి మధ్యలో కోర్సు మానేస్తే మిగిలిన కాలానికి ఫీజును దామాషా ప్రకారం తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ఒరిజినల్ అకడమిక్ సర్టిఫికెట్లను తీసుకోరాదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఈ కోచింగ్ సెంటర్లలో పనిచేయడంపై నిషేధం విధించారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక వెబ్‌సైట్‌ను నిర్వహించాలని, అందులో ఫీజులు, సిబ్బంది, మౌలిక వసతుల వివరాలను పొందుపరచాలని ఆదేశించారు.

**నిబంధనలు మీరితే రిజిస్ట్రేషన్ రద్దు.. కోచింగ్ సెంటర్లకు భారీ జరిమానాలు**

నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. లోపాలను సరిదిద్దుకోవడానికి 15 రోజుల గడువు ఇస్తారు. ఆ తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే మొదటిసారి రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష జరిమానా విధిస్తారు. మూడోసారి కూడా ఉల్లంఘన పునరావృతమైతే ఆ సెంటర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు.

# మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ

**మొదటిపేజీ తరువాయి**

రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : హరీశ్‌రావు**

మినరల్ డీలర్ లైసెన్స్, పీసీబీ అనుమతి లేకుండా శంషాబాద్ మండలం కోత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత టి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.పది వేలు జరిమానా, రెండోసారి ఉల్లంఘిస్తే రూ.25 వేలు జరిమానాతోపాటు ఏడాదిపాటు కఠిన కారాగార శిక్ష విధించాలని చట్టంలో ఉందన్నారు. లైసెన్స్, ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు పీసీబీ, మైనింగ్ శాఖలు రెండుసార్లు షోకాజు నోటీసులు పంపాయనీ, ఆ క్రషర్‌ను సీజ్ చేయాలని కోరాయని గుర్తు చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ ఎవరిదో తెలియదా?అని ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌పై తాను ఎక్స్ ద్వారా ట్వీట్ చేస్తే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఓ పత్రికలో దానిపై స్పందించారని వివరించారు. మైనింగ్ ప్రాంతంలో కాంగ్రెస్ జెండా కూడా ఉందన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు తొలిముద్ద

**మొదటిపేజీ తరువాయి**

కమిటీలో అంగన్వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని వ్యాఖ్యానించారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, విద్య, సాగునీరు, వ్యవసాయాభివద్ధికి దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రత ఉన్నప్పటికీ, పౌష్టికాహారం అందడం లేదన్నారు.అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందించే బాధ్యత తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని మంచి ప్రణాళికలు చేసినా అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమేనని చెప్పారు. అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని చెప్పారు. అంగన్వాడీల్లో చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని వారికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నదని తెలిపారు. 'మీ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామ'ని సీఎం అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆరేండ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని వివరించారు. భవిష్యత్‌లో అవే అనారోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లకు సీఎం మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అనితా రామచంద్రన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం బెదిరింపు రాజకీయాలు

**మొదటిపేజీ తరువాయి**

శనివారం అసెంబ్లీ మీడియా హాల్లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ము కోసం మూసీ పేరిట రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని తప్పుపట్టారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్లతో రూపొందించిన సమగ్ర ప్రణాళికను పక్కన పెట్టి, భారీ అంచనాలతో అవినీతి కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందనీ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని గుర్తుచేశారు. మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షలాది ఇండ్లను కూల్చివేయడానికి, దాదాపు 3 వేల ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇండ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. అవినీతిని తాను ప్రశ్నిస్తే "శివతాండవం చేస్తాను" అంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రం "పిచ్చోడి చేతిలో రాయి" లాగా మారిందనీ, అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రెండున్నరేండ్ల నుంచి మోసం చేస్తున్నారని దుఉయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టుపై అసలు ప్రణాళికలు లేకుండా, డీపీఆర్ కూడా సిద్ధం చేయకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఇండ్లు కూల్చకుండా, భూములు స్వాధీనం చేసుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని కేటీఆర్ మండిపడ్డారు. ఏప్రిల్ మెదటివారంలో మేధావులు, పర్యావరణ నిపుణుల తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే ఏప్రిల్ 14 వరకు ప్రతీ కాలేజీ, బస్తీలో ప్రచారం చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనీ, లేకపోతే ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా వేలాది మందితో వెళ్లి తాళాలు బద్దలుకొట్టి ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# వీర హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రకు

## ముఖ్య అతిథిగా హాజరవ్వాలని కూన శ్రీనివాస్ గౌడ్ కు ఆహ్వాన పత్రిక అందజేసిన కమిటీ సభ్యులు



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జీడిమెట్ల విలేజ్ లో గల శ్రీ పాత ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల ఏప్రిల్ రెండో తేదీ నాడు సాయంత్రం నిర్వహించే శ్రీ వీర హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఈరోజు షాపూర్ నగర్ లోని నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ని ఆహ్వానించి కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమం కమిటీ సభ్యులు శేఖర్, కళ్యాణ్,సాయి, సందీప్,జంగారెడ్డి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలప్ప పాల్గొన్నారు.

# శ్రీరాముడి పయనం పులకించెను పుర ప్రపంచం..

**కొత్తూరులో అర్ధరాత్రి వరకు శోభాయాత్ర, అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్యం..**


**పెద్దల చేతుల మీదుగా చిన్నారులకు బహుమతులు అందజేసిన దాత సిటీ కేబుల్ వెంకటేష్.**



**ప్రజావినికిడి,(కొత్తూరు):**పురపాలక కేంద్రంలో నవమి వేడుకలను పురస్కరించుకొని జగదభిరాముడి కళ్యాణం అంగరంగ వైభవంగా సాగింది. సాయంత్రం పురవీధుల గుండా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయుడి విగ్రహాలను ఊరేగించారు. వాడవాడలో భక్తులు ఎదురువెళ్లి స్వామి వార్లను దర్శించుకున్నారు. నాట్య శ్రీ కళామండలి నిర్వాహకురాలు శ్రీజ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్యంతో అలరించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఈ చిన్నారుల సేవను గుర్తిస్తూ స్థానిక సిటీ కేబుల్ వెంకటేష్,గ్రామ పెద్దలు సుదర్శన్ గౌడ్,మాసుల లక్ష్మయ్య, అంజయ్య,నాగరాజు చారి,రాజశేఖర్ రెడ్డి,రవి నాయక్, వాటర్ మల్లేష్,ఆంజనేయులు గౌడ్,శ్రీను చారి,జి.రవి,బాలు, మాసుల రామకృష్ణ ముదిరాజ్, అనిల్, చేతుల మీదుగా చిరు కానుకలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు శర్మ,గణేష్ యాదవ్, బాలు,మాసల సురేందర్, నరసింహ గౌడ్,వెంకన్న, అనిల్,మురళి,ఉదయ్,రామ్‌జీ, ధీరజ్,గ్రామ పెద్దలు యువతి యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

## భక్తులకు అన్నదానం చేసిన పంతులు జగన్ శాంతాబాయి దంపతులు



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు,రాఘవేంద్రాచార్య, అర్చకులు,ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన పంతులు జగన్, శాంతాబాయి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన జగన్,శాంత బాయ్ దంపతులను సోలిపూర్ మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామనవమి వేడుకలకు పౌల్ట్రీ వ్యాపారవేత్త గుదే వసంతరావు 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా దేవాలయ ఆవరణలోని గార్డెన్ లో ఉన్న హనుమాన్ విగ్రహానికి పట్టణానికి చెందిన దుర్గా శంకర్,రాజ్యలక్ష్మి దంపతులు తమ సొంత డబ్బులతో నూతన రంగులు వేయించి విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు,భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో దోమల నివారణ కోసం ఫాగింగ్

**18వ వార్డులో కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి బాయి చందూలాల్ ఆధ్వర్యంలో**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మునిసిపల్ 18 వ వార్డు కౌన్సిలర్ జమాల్‌పూర్ సంతోషి చందులాల్ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని శ్రీనగర్ కాలనీ,భాగ్యనగర్ కాలనీ,సిమ్లానగర్ కాలనీలలో దోమల నివారణ కోసం ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించబడిందిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఎక్కడైనా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కులని కాపాడలేని రేవంత్ రెడ్డి

# ఇక తెలంగాణ ప్రజల హక్కులను ఎం కాపాడుతడు

**రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు..**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఆంధ్రాలో కూటమి సర్కారు అరాచకాలు, తెలంగాణపై ఆంధ్ర పెత్తనాన్ని నిరసిస్తూ "తెలంగాణ సమాఖ్య" ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ మధ్యనే తెలంగాణ పౌరుడు-జర్నలిస్ట్ కేవీఆర్ పై ఆంధ్ర పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన కేసు ఇది. చట్టాన్ని, న్యాయస్థానాలను గౌరవించి కర్నూల్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లిన కేవీఆర్ ని 24 గంటలకు పైగా స్టేషన్ లో నిర్బంధించి తీవ్రంగా హింసించారు. కేవీఆర్ భార్య విజయలక్ష్మి హెబీయస్ కార్పస్ పిటిషన్ వేయడంతో విడిచిపెట్టారు. కేవీఆర్ అరెస్టు-రిలీజ్ విషయంలో అడుగడుగునా పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించారు. ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం అన్యాయాలపై, అసమర్ధ-అరాచక-ప్రజా వ్యతిరేక పాలనపై ప్రశిస్తు వచ్చిన కేవీఆర్ పై పాలకులు పగబట్టారు. ఈ క్రమంలోనే విచారణకు హాజరైన కేవీఆర్ పై కూటమి సర్కారు, ఆంధ్ర పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. ఇది ఒక్క కేవీఆర్ పై జరిగిన దాడి కాదు. తెలంగాణ అస్థిత్వంపై జరిగిన దాడిగా తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులు,ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రశ్న గొంతు నొక్కడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జర్నలిస్ట్ సమాజం ఏకం కావాల్సిందేనని పిలుపునిచ్చారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ "చంద్రబాబు పాలన అంటేనే దుర్మార్గం. గతంలో బెల్లి లలిత, మరోజు వీరన్న, గద్దర్ లాంటి ఏంతో మంది తెలంగాణ బిడ్డలను, ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్న నరరూప రాక్షసుడు చంద్రబాబు. జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి కూడా అలాంటిదే. బిడ్డ చంద్రబాబు తెలంగాణ బిడ్డలపై నీ జులుం ఆపకపోతే మరోసారి తెలంగాణ సత్తా చూపిస్తాం. రాష్ట్రం విడిపోయినా తెలంగాణపై చంద్రబాబు పెత్తనం తగ్గలేదని, రేవంత్ ప్రభుత్వం ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలి" అని తీవ్రంగా విరుచుకుపడ్డారు.

తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి మాట్లాడుతూ, "ఆంధ్ర-తెలంగాణ విడిపోయినా చంద్రబాబు పెత్తనం తగ్గలేదని ఇప్పటికి తెలంగాణా భూముల్ని తన సామజిక వర్గాన్ని దోచిపెట్టేలా వ్యవరిస్తున్నా డని విమర్శించారు. బాబు పాలనపై గొంతెత్తితే కేవీఆర్ లాంటి జర్నలిస్టుని ఎలా గొంతు నొక్కే ప్రయత్నం చేసారో గమనించాలని తెలంగాణ సమాజం ఇప్పటికైనా మేల్కోకపోతే మరింత నష్టపోతామ" అని హెచ్చరించారు.

సినీ నిర్మాత డైరెక్టర్ సైయద్ రఫీ మాట్లాడుతూ "జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నాం. కేవీఆర్ పై పెట్టిన కేసును 24 గంటలలోగా మూసేసి క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ సత్తా ఏంటో చూపిస్తాం" అని హెచ్చరించారు.

క్రాంతిదళ్ పార్టీ ఫౌండర్ పృథ్వి రాజ్ మాట్లాడుతూ "జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి తెలంగాణ ఆత్మగౌరవంపై జరిగిన దాడి. ఇది చిన్న అంశం కాదు. చాల సున్నితమైన అంశం. జర్నలిస్ట్ అంటేనే ప్రశ్న. వాళ్ళ గొంతు నొక్కుతమంటే సూస్తూ ఊరుకునేది లేదు. జర్నలిస్టుల హక్కులని కాపాడలేని రేవంత్ రెడ్డి ఇక తెలంగాణ ప్రజల హక్కులను ఎం కాపాడుతడు. బిడ్డా చంద్రబాబు తెలంగాణ ఒక్కసారి గర్జిస్తేనే రాష్ట్రము దాటెల్లిపోయినవ్. మల్ల మాజోలికొస్తే ఈసారి చీరి చింతకు కడతం" అని హెచ్చరించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారుడు హైకోర్టు అడ్వకేట్ మల్లారెడ్డి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఉపాధ్యక్షుడు ప్రో. పిట్టల రవిబాబు, మన తొలివెలుగు రఘు,కాళోజి టీవీ ఓనర్ దాసరి శ్రీనివాస్,జర్నలిస్ట్ శంకర్ తో పాటు డిజిటల్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం

## ఉస్మానియా యూనివర్సిటీ మాథమాటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ





**ప్రజావినికిడి, (శంషాబాద్): మార్చి28,** భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం వందేమాతరం అని మహానగర ప్రాముఖ డాక్టర్ రామకృష్ణ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కేంద్రంలోని వై ఎస్ ఆర్ గార్డెన్ లో శనివారం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఏబీవీపీ శంషాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మహానగర ప్రాముఖ్ డాక్టర్ రామకృష్ణ, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్,జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, వందేమాతరం 150వ చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల నిబద్ధతను తెలియజేయడంతో పాటు భావితరాలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. దేశం సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జరుపుకొంటోందన్నారు. వందేమాతరం రాసిన వేళ భారత్ బానిసత్వంలో ఉందన్నారు. దానికి 100 ఏళ్ళు పూర్తయిన వేళ భారత్ రాజ్యాంగం గొంతు నొక్కేశారన్నారు. వందేమాతరం భారత్ కు స్వేచ్ఛావాయువులు ఇచ్చేందుకు ఉపయోగపడిందో. దాని 100 ఏళ్ల సమయంలో చీకటికాలం నడిచిందన్నారు. 1947లో ఇదే గేయం మనకు స్వాతంత్ర్యం ఇప్పించిందన్నారు. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదన్నారు. వేదకాలం నుంచి ఈ భూమి నా తల్లి, నేను భూమి పుత్రుడను అని చెబుతుందన్నారు. బ్రిటిష్ వారు భారతీయుల్లో ఆత్మన్యూనత నింపేశారన్నారు. ఆ సమయంలో బంకించంద్ర ఛటర్జీ భారతీయుల శక్తిని తెలియజేసేలా ఈ గీతాన్ని రచించారన్నారు. పరాయి పాలనలో ఉన్న భారతీయుల్లో ఇది ఎన్నో ఆశలు నింపిందన్నారు. తమ పోరాటం కేవలం భూమి, అధికారం కాదని.. బానిసత్వ సంకెళ్లను తెంచుకొని సంస్కృతిని పునరుజ్జీవింపజేయడానికే అన్న సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఆంగ్లేయులు విభజించి పాలించే మార్గాన్ని ఎంచుకొన్నారన్నారు. ఇందుకు బెంగాల్ ను ప్రయోగశాలగా మార్చారన్నారు. వారికీ తెలుసు.. బెంగాల్ శక్తి దేశానికి ప్రేరణగా నిలుస్తుందని. అందుకే ఆ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే.. దేశం విడిపోతుందని అంచనా వేశారన్నారు. దీనికి అనుగుణంగానే బెంగాల్ విభజన జరిగిందన్నారు. బ్రిటిష్ వారు ఈ పాపం చేసిన సమయంలో వందేమాతరం ఓ శిలలా ఎదురొడ్డి నిలిచిందన్నారు. ఆ నినాదమే ప్రజల్లో ప్రేరణ నింపిందన్నారు. ఇది భారత్ బలహీనపడకుండా. మరింత బలోపేతం చేసిందన్నారు. బెంగాల్ విభజన జరిగినా..ఓ పెద్ద స్వదేశీ ఉద్యమం పుట్టుకొచ్చిందన్నారు. వందేమాతరం అన్నిచోట్ల మార్మోగింది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్,గర్ల్స్ కో కన్వీనర్ మేఘన, టౌన్ జాయింట్ సెక్రటరీ సంతోష్, పవన్,వేణు చారి, చైతన్య,భరత్, పవన్,మహేష్, యశ్వంత్, కార్యకర్తలు పాల్గొన్నారు

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

**200 క్రిమినల్ కేసులు,5 సివిల్ కేసులు,616 డ్రంక్ అండ్ కేసులు,8 బ్యాంకు కేసుల పరిష్కారం**

**అందరినీ అభినందించిన 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ స్వాతి రెడ్డి**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని సివిల్, క్రిమినల్,బ్యాంకు,డ్రంక్ అండ్ డ్రైవ్, మరియు పిట్టి కేసుల పరిష్కారం దిశగా సాగిన లోక్ అదాలత్ కార్యక్రమం అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి అలాగే మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ స్వాతి రెడ్డి ఆదేశాలతో శనివారం ముగిసింది. లోక్ అదాలత్ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎస్ స్వాతి రెడ్డి తో పాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,
పట్టణ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాజీమార్గమే



రాజమార్గంగా సాగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 200 క్రిమినల్ కేసులు,616 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,5 సివిల్ కేసులు,8 బ్యాంకు కేసులు పరిష్కరించబడినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ విభాగం తెలిపింది. లోక్ అదాలత్ కార్యక్రమం సందర్భంగా కేసుల పరిష్కారానికి చొరవ చూపిన న్యాయవాదులను మరియు పోలీసులను,కోర్టు సిబ్బందిని, కక్షిదారులను 16వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి,మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎస్ స్వాతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా,ప్రధాన కార్యదర్శి సి హెచ్ శ్రీనివాసమూర్తి,లైబ్రరీ సెక్రెటరీ కోటి జయమ్మ,కోశాధికారి రహీముద్దీన్,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ శంకర్,మాజీ ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి,టి ఆంజనేయులు గౌడ్,చెట్ల శంకర్,గోపాల చారి గంతల నాగరాజు,సయ్యద్ ఖలీల్,బ్యాంకు అధికారులు సిబ్బంది,కోర్టు పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

# చించోడులో మెగా హెల్త్,క్యాంప్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ర్యాకాల శ్రీనివాస్,డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి

### పాల్గొన్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక లో భాగంగా,స్పెషలిస్ట్ డాక్టర్ల మెగా వైద్య ఆరోగ్య క్యాంపును నిర్వహించడం జరిగింది.ఈ మెగా హెల్త్ ఆరోగ్య క్యాంపును చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్,డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి,షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి చే ప్రారంభించబడింది.ఈ క్యాంపులో డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు, ఈరోజు ఆరు మంది స్పెషలిస్ట్ వైద్య అధికారులు వచ్చారు. చించోడు గ్రామ ప్రజలందరూ కూడా ఓపికతో,సహనంతో మీకు ఉన్న ప్రాబ్లం తెలియచేసి కన్సల్ట్ వైద్యాధికారితో పరీక్షలు చేయించుకుని,చికిత్స పొందగలరని తెలియజేశారు. తదుపరి చించోడు గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ మన గ్రామంలో ఆరు మంది స్పెషలిస్ట్ వైద్యాధికారులతో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం మన అందరికీ ఆనందదాయకము అని ఇట్టి మెగా హెల్త్ క్యాంపు అవకాశాన్ని మన గ్రామ ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని,ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా వైద్యాధికారులతో సవినయంగా వివరించుకొని, మీకు కావాల్సిన పరీక్షలు అన్నీ కూడా ఉచితంగా చేస్తారు అని,మరి మీకు కావలసిన మందులు అన్ని కూడా ఇస్తారని తెలియజేశారు.ఈ క్యాంపు కొచ్చిన ప్రజలందరూ కూడా తొందరపాటు పడకుండా, నిదానంగా అందరూ పరీక్షలు చేయించుకోవాలని,అందరికి పరీక్షించిన తర్వాతనే ఈ వైద్య అధికారులు వెళ్తారని,అందరు తొందర పడవద్దు అని సర్పంచ్ ర్యాకాల శ్రీనివాస్ తెలియజేశారు. శనివారం రోజు మెగా హెల్త్ క్యాంపులో దంత సమస్యలు ఉన్న 39 మందినీ, కంటి సమస్యలు ఉన్న 70 మందినీ,గైనిక్ సమస్యలు ఉన్న 47 మందినీ,ఎముకలకు సంబంధించిన 105 మందినీ, చిన్నపిల్లల ను 37 మందినీ,జనరల్ ఫిజీషియన్ చూసినవారు175 మందినీ,మొత్తం ఈరోజు 473 ఓ.పి.ని పరిశీలించారని డాక్టర్ స్రవంతి తెలియజేశారు.

ఈ మెగా హెల్త్ క్యాప్ లో డాక్టర్ ప్రణీత గైనకాలజిస్ట్,డాక్టర్ స్మిత దంత వైద్యురాలు,డాక్టరు ఉమా ఆప్తాల్మిక్ వైద్యురాలు,డాక్టర్ అఖిల్ ఎముకల వైద్యుడు,డాక్టర్ పవన్ జనరల్ మెడిసిన్,ల్యాబ్ టెక్నీషియన్లు నవనీత అశోక్,చించోడు వైద్యాధికారి డాక్టర్ స్రవంతి,హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు,ఎం ఎల్ హెచ్ పి వైద్య అధికారులు డాక్టర్ సంధ్య,డాక్టర్ ప్రవీణ,డాక్టర్ సత్యనారాయణ,డాక్టర్ కార్తిక్, డాక్టర్ జగదీష్,డాక్టర్ అహ్మద్, డాక్టర్ దినేష్,హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ,చంద్రకళ,ఫార్మసిస్టు ఉదయ్ కుమార్,స్టాఫ్ నర్స్ సువర్ణ,డీఈవో విజయ, చించోడు విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి, చెవులపల్లి సర్పంచ్ జంగయ్య, దేవునిపల్లి డిప్యూటీ సర్పంచ్ మల్లేష్,చించోడు వార్డు మెంబర్లు శేఖర్, గిరిధర్,వై.యాదగిరి, సంతోష్,రామచందర్,ఎం. యాదగిరి, ఉమామహేశ్వర్, ఏఎన్ఎంలు ఆశలు పాల్గొన్నారు.

# శ్రీరాముడు ధర్మానికి ప్రతీక -రాముడు మన శ్వాస

### రామనామం మన హృదయ స్పందన.. యువత శ్రీరాముని ఆదర్శాలను అనుసరించాలి.

### బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణంలో శ్రీరామ నవమి సందర్భంగా హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ శోభాయాత్ర ఘనంగా జరిగింది.కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ శోభాయాత్ర షాద్ నగర్ పట్టణ లోని ప్రధాన రహదారుల మీదుగా భారీగా సాగింది.జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు,యువత పెద్ద ఎత్తున పాల్గొని పట్టణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,విశ్వ హిందూ పరిషత్ నాయకులు బండారు రమేష్,అందే బాబయ్య,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,దేపల్లి అశోక్ గౌడ్,చెంది మహేందర్ రెడ్డి,మనోహర్ రెడ్డి,ప్యాట అశోక్ తదితరులు పాల్గొన్నారు.శోభాయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథులుగా శ్రీశ్రీ ఆదిత్య పర శ్రీ స్వామి,కృష్ణ స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీరాముడు సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచారని, రాముడు మన శ్వాసలాంటివాడని,రమనామం మన హృదయ స్పందన అని పేర్కొన్నారు. ఆయన జీవితం ధర్మం,న్యాయం,సత్యం ప్రజల పట్ల బాధ్యతతో ఎలా జీవించాలో ప్రపంచానికి మార్గదర్శకమని తెలిపారు.హిందుత్వం కేవలం మతం మాత్రమే కాదని, ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు,విలువలు జీవన విధానాన్ని ప్రతిబింబించే మహత్తర ఆలోచన అని చెప్పారు. శోభాయాత్ర హిందూ ఐక్యతను చాటిచెప్పే వేదికగా నిలుస్తుందని, గత 18 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ యాత్ర నేడు వేలాది మంది యువకులు, మహిళలు,భక్తులు పాల్గొనే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఈ శోభాయాత్రను మరింత విస్తృతంగా నిర్వహించడం ప్రతి హిందువుకు బాధ్యత అని,యువత శ్రీరాముని ఆదర్శాలను జీవితంలో అనుసరించి సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. శ్రీరాముని ఆశీస్సులతో సమాజంలో ఐక్యత, సేవాభావం,దేశభక్తి పెంపొందాలని ఆకాంక్షించారు.

ఈ శోభాయాత్రలో పట్టణంలోని వేలాది మంది కార్యకర్తలు,శ్రీరామ భక్తులు ఉత్సాహంగా పాల్గొని భక్తి భావాన్ని చాటగా,కార్యక్రమం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగింది.

# జిల్లాలో వంట గ్యాస్,పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు..

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి..



**ప్రజావినికిడి ,(రంగారెడ్డి):** జిల్లాలో వంట గ్యాస్,పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరం నందు సివిల్ సప్లై అధికారులు,గ్యాస్ ఏజెన్సీలు,పెట్రోల్ బంకుల నిర్వహకులతో జిల్లాలో గ్యాస్ పెట్రోల్,డీజిల్ సరఫరా,వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని,తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు.గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత,సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని స్పష్టం చేశారు.షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కొరత లేదని,ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి కొరత ఉన్నదని సమస్యలు సృష్టించకుండా,అధిక మోతాదులో తీసుకొని ఇండ్లలో నిల్వ చేసుకోవద్దని,దాని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అవసరానికి మాత్రమే తీసుకోవాలని సూచించారు.పెట్రోల్ బంకుల నిర్వహకులు వాహనాలలో మాత్రమే పెట్రోల్,డీజిల్ వేయాలని,క్యాన్స్ లో,బాటిల్స్ లో వేయరాదని,ప్రజలకు అవగాహన కల్పించాలని,స్కూల్,ఆసుపత్రి వంటి ప్రాధాన్యత కలిగిన వాహనాలకు సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని,గ్యాస్,పెట్రోల్,డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు గ్యాస్ ఏజెన్సీలు,పెట్రోల్ బంకుల నిర్వహకులు అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా ప్రజలకు మరోసారి తెలియజేస్తూ గ్యాస్,పెట్రోల్,డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నందున ఎటువంటి ఆందోళన అవసరం లేదు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సరఫరా సక్రమంగా కొనసాగుతోంది.కాబట్టి ప్రజలు అపోహలు,వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి,జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి,కేషు రామ్,వ్యవసాయ శాఖ అధికారి ఉషా,గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు,పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ కు ఘన సన్మానం

### సన్మానించిన బల్కంపేట్ వీరశైవ సేవా సమాజం



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన వేద పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు,షాద్ నగర్ వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు అగ్గనూర్ బసవేశ్వర్ ను కిషన్ నగర్ వేద పాఠశాల లో సన్మానించిన్న హైదరాబాద్ బల్కంపేట్ వీరశైవ సేవా సమాజం సభ్యులు,అనంతరం అధ్యాపకులు శ్రీ సంగయ్య స్వామి మరియు విద్యార్థులు వేద మంత్రోచనాలతో ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలోఅధ్యక్షులు కొత్తూరు వైద్యం శేఖర్ అప్ప చంద్రశేఖర్,శక్తి ప్రకాష్,వీరప్ప,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం..

### సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన కాంగ్రెస్ నేత ముబారక్ అలీ ఖాన్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని షాద్ నగర్ కాంగ్రెస్ సీనియర్ నేత ముబారక్ అలీ ఖాన్ అన్నారు.పట్టణంలోని 13వ వార్డు లో అనారోగ్యంతో బాధపడుతున్న బొర్ర నవీన్ కుటుంబానికి రూ.60 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం పట్ల అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు.ఎవరికి అనారోగ్య పరిస్థితులు ఉన్నప్పటికీ ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా ముబారక్ అలీ ఖాన్ తెలియజేశారు.


# శ్రీ కృష్ణ పత్తి గోదాంలో అగ్ని ప్రమాదం

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసిపి లక్ష్మీనారాయణ..

### ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ నందిగామ పిఎస్ పరిధిలో ఘటన



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని శ్రీ కృష్ణ పత్తి గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం రోజు ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగి,గోదాంలో నిల్వ ఉంచిన పత్తి అగ్నికి ఆహుతైంది.
సంఘటన స్థలాన్ని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీ నారాయణ,సీఐ ప్రసాద్ పరిశీలించారు.
ప్రమాదం జరిగిన తీరుపై విచారణ జరుపుతున్నామని ఏసీపీ లక్ష్మీ నారాయణ తెలిపారు.
వివరాల్లోకి వెళితే,సీసీఐ ధృవీకరించిన శ్రీ కృష్ణ పత్తి గోదాంలో మంటలు చెలరేగినట్లు వెల్లడించారు.గోదాం బయట నుంచి పొగ రావడం గమనించిన సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్‌కు అలాగే పోలీసులకు సమాచారం అందించారు.గోదాంలో విద్యుత్ సరఫరా లేదని, నిన్న రాత్రి పడిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల ప్రభావంతో ప్రమాదం జరిగి ఉండవచ్చనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ లక్ష్మీ నారాయణ తెలిపారు.



# అమరావతి అజేయం,అద్భుతం

## అమరావతి రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

**అమరావతి మార్చి28ప్రజావినికిడి**

అమరావతి అజేయం, అద్భుతమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక ఒక్క అంగుళం కూడా అమరావతిని కదల్చలేరని స్పష్టం చేశారు. "ఇది చట్టబద్ధమైన భరోసా. తెలుగు వైభవం అయిన అమరావతే శాశ్వత రాజధాని" అని చంద్రబాబు శాసనసభలో పునరుద్ఘాటించారు. 2028 నాటికల్లా అమరావతి తొలిదశ పనులు పూర్తవుతాయని ప్రకటించారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగా లు అసామాన్యమైనవని, అనేక కష్టనష్టాలను తట్టుకున్న వారికి పాదాభివందనం అంటూ చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తీర్మానానికి మద్దతు పలికిన సభ్యులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఏమన్నారంటే...



"అమరావతికి వ్యతిరేకంగా జరిగిన కుట్రలు, కుతంత్రాలు, రైతుల పట్ల గత ప్రభుత్వం చేసిన దమనకాండ, అన్యాయం చూసి చలించిపోయాను. అనేక సందర్భాల్లో చాలా కోపం వచ్చింది. ఇంత అన్యాయం చేస్తారా? అని భావోద్వేగానికి లోనయ్యాను. ఆనాటి పరిణామాలను సభలో పలువురు సభ్యులు గుర్తు చేసినప్పుడు మరోసారి ఉద్వేగం కలిగింది. ఇంత జరిగినా రాజధానిపై వైసీపీ బుద్ధి మారలేదు. గతంలో మాదిరిగానే ఇంకా అమరావతిపై కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉంది. రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటున్నారు. వీళ్లకు ఏమైనా ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందేమో? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వాళ్లు అనుసరిస్తారు. కానీ మనం అంబేద్కర్ రాజ్యాంగం అనుసరిస్తున్నాం. విభజన అనంతరం ఏపీకి రాజధాని విజయవాడ-గుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని 46 శాతం మంది కోరుకున్నట్లుగా శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పింది. మేం అదే పని చేశాం. చారిత్రక నేపథ్యం ఉన్న అమరావతి ప్రాంతాన్నే రాజధానిగా ఏర్పాటు చేశాం. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న జగన్ బేషరతుగా అమరావతికి మద్దతు ఇస్తున్నానని గతంలో చెప్పారు. కానీ ఇప్పుడు రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు.""ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ 2019 నుంచే విధ్వంస పాలన మొదలుపెట్టింది. వారి చర్యలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు రాజధాని పరిరక్షణ కోసం, జగన్ మూడు ముక్కలాటకు నిరసనగా చేపట్టిన ప్రజా పోరాటాలను ఉక్కుపాదంతో అణచివేశారు. రైతులు, మహిళలపై కేసులు పెట్టి బూట్లతో తన్నారు. లాఠీలతో కొట్టారు. అడ్డగోలుగా కేసులు పెట్టి కీచకపర్వం సాగించారు. శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీ ద్వారా పాస్ చేయించాలని చూశారు. అయినా హైకోర్టు న్యాయాన్ని కాపాడింది. మూడు రాజధానుల ప్రతిపాదన తుగ్లక్ నిర్ణయమని మీడియా పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేసింది. గత పాలనలో రైతులు, మహిళలు, నేను, పవన్ సహా అందరం బాధితులమే.""రాష్ట్రానికి రాజధాని ఒక్కటే. అదే అమరావతి. కానీ, అభివృద్ధి మాత్రం వికేంద్రీకృతం. రాష్ట్రంలోని అ న్ని ప్రాంతాలను ప్రగతిపథంలోకి తెస్తాం. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. ఆ ప్రాంతాలను మెగా సిటీలుగా అభివృద్ధిచేస్తాం. అమరావతి స్వయం అభివృద్ధి విధానంలో నిర్మితమవుతుందని చెప్పాం..అదే జరుగుతుంది.""అమరావతి నిర్మాణ బాధ్యతను పార్లమెంట్ తీసుకుంటుందని ప్రధాని నరేంద్రమోదీ భరోసా ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ. 15వేల కోట్ల తక్షణ సహాయం అందించింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి అమరావతికి ఒక రూపు తీసుకొస్తాం. 2027 నాటికి రహదారులు, లే అవుట్‌లు సహా కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన పూర్తవుతుంది. ప్రస్తుతం రూ.56వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయించి ప్రధాన మంత్రిని పిలిపించి, ఆయనతోనే ప్రార ంభింపచేస్తాం. ఇదే మా సంకల్పం. ప్రతి తెలుగువ్యక్తీ గర్వపడేలా అమరావతి రాజధాని ఉంటుంది. నాది అమరావతి, నా రాజధాని అమరావతి అని తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే రోజు తప్పకుండా వస్తుంది." అని సీఎం చంద్ర బాబు వ్యాఖ్యానించారు.

# అమరావతి ఒక్కటే రాజధాని..

**గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు**

**భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు**

**బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం**

**అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం**

**అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్**



**అమరావతి, మార్చి28ప్రజావినికిడి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

**గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం**

**ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం**



**హైదరాబాద్,మార్చి28ప్రజావినికిడి**



ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కమనీయం..
# సీతారాముల కళ్యాణం..

**అమ్మపల్లి సీతా రామచంద్ర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం..**

**పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్..**

**నర్ఖూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం..**



**ప్రజావినికిడి,(శంషాబాద్):**



శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలో వెలసిన చారిత్రాత్మక అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నర్ఖూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మపల్లి దేవాలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగాయి. సీతారామ కళ్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు శంషాబాద్ పరిసరాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్,ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పతంగి రాజగోపాల్ గౌడ్, కార్తీక్ రెడ్డి,తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కళ్యాణ మహోత్సవంలో వారు పాల్గొని, అత్యంత భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణాన్ని తిలకించారు.లోక కళ్యాణం కోసం జరిగిన ఈ వేడుకలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, అత్యంత పురాతనమైన, మహిమాన్వితమైన అమ్మపల్లి దేవస్థానంలో సీతారాముల కళ్యాణాన్ని వీక్షించడం నా పూర్వజన్మ సుకృతం. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ శ్రీరామచంద్రుడిని ప్రార్థించానన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల మాజీ జడ్పీటీసి నీరటి తన్వి రాజ్ ముదిరాజ్,బుక్క గోపాల్, సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,ఈ ఓ రామ శర్మ,చంద్రారెడ్డి, కోలన్ మహేందర్ రెడ్డి,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ బి సతీష్, మాజీ ఎంపీటీసీ గౌతమి అశోక్, నర్కుడ మాజీ సర్పంచ్ సునగంటి సిద్ధులు, నర్ఖూడ ఉప సర్పంచ్మహేష్ ముదిరాజ్, హెచ్.శివాజీ,ఎన్ శేఖర్ ముదిరాజ్, గుండాల విశ్వనాథం, సందనవెల్లి శ్రీనివాస్,ఎన్ జంగయ్య, నానవాలా కుమార్ యాదవ్,నీరటి కృష్ణ మెండే కుమార్ యాదవ్ సంజయ్ యాదవ్ పెద్ద భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల స్పోర్ట్స్ మీట్



**హైదరాబాద్, మార్చి28ప్రజావినికిడి**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి కనుమరుగైందని, క్రీడలంటే ఎలా ఉంటాయని వెతుక్కునే పరిస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని, ప్రపంచ స్థాయిలో పరిణామాలు, వివిధ క్రీడలు, క్రీడాకారులు, శిక్షణకు ప్రత్యేక సలహాదారుడ్ని ఏర్పాటు చేశామని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీతో మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర శాసన మండలి, శాసన సభ సభ్యులకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎల్బీ స్టేడియంలో శనివారం స్పోర్ట్స్ మీట్-2026ని సీఎం రేవంత్ రెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంత్రి జూపల్లి ఆ జ్యోతితో మైదానంలో రన్‌లో పాల్గొని మిగతా సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు ప్రతిపక్ష నాయకులు క్రీడలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారని, అదేం క్రీడా స్ఫూర్తో తనకు అర్థం కావడం లేదని విమర్శించారు. రాజకీయాలకతీతంగా మైదానంలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తే.. భవిష్యత్తు తరాలు



కలిసిమెలిసి ఉండే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. "ప్రతిపక్షాల ఆలోచనలు ఎంతసేపు ఫాంహౌవీసల్లో పార్టీలు, పబ్‌ల్లో విందుల గురించే. ఫాంహౌస్ పార్టీలు, పబ్‌ల్లో విందులకు, డ్రగ్స్, గంజాయి, మత్తుకు యువతను దూరంగా ఉంచేందుకు 'మత్తు బాట వీడండి.. మైదానాల బాటపట్టండి' అని పిలుపునిచ్చాం. ఈ స్ఫూర్తి కొనసాగుతుంది" అని ప్రకటించారు.

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్‌ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం,




హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ. 93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

## బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

### ● ఐపిఎల్ ప్రారంభంతో

### యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్,మార్చి28:** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

## బతుకులు 'బుగ్గి'పాలు!



ప్రభుత్వాల, ప్రయివేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే! ఎందుకంటే, గతేడాది కర్నూల్‌లో జరిగిన ఘటనలో ఇలాగే పందొమ్మిది మంది అసువులు బాశారు. చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరవై మందివరకు కంకర కుప్పల్లోనే ఊపిరొదిలారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు పాఠాలు నేర్వక పోవడం విచారకరం. తాజా ఘటనలో మృతుల వివరాలు చూస్తే సామాన్యుల దుస్థితి స్పష్టమవుతోంది. వారంతా బతుకుదెరువు కోసం ఏపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు వలసొచ్చిన కూలీలు. కొందరు ఇటుకబట్టీల్లో పనిచేస్తే మరికొందరు భవన నిర్మాణరంగాల్లో స్థిరపడ్డారు. రోజూ పనిచేస్తేనే నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్తాయి, లేదంటే పస్తులే. ఆస్తిపాస్తులేమీ లేవు. వచ్చే పదోపరకతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. శ్రీరామనవమి సందర్భంగా కొందరు, అప్పులను

రోజువారి చెమటోడ్చి పొట్టనింపుకునే చేతులు..కుటుంబపోషణ కోసం ప్రయాణించిన పాదాలు.. ఒక్క క్షణంలో అగ్నికి ఆహుతైపోయాయి. ఏపీలోని మార్కాపురం దగ్గర రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రవాణా వ్యవస్థలోని లోపాలను మరోసారి బహిర్గతపరిచింది. ప్రయివేటు బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో పద్నాలుగు మంది సజీవ దహనమవ్వడం తీవ్ర విషాదం. ప్రాణాలు కోల్పోయిన వారంతా కూలీలే కావడం మరీ హృదయ విదారకం. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ఉపాధి కోసం వలసొచ్చిన వారు, చివరకు కుటుంబాలనే అంధకారంలోకి నెట్టారు. ఇది ముమ్మాటికీ

చూసొద్దామని మరికొం దరు సొంతూళ్లకు బయలుదేరారు. కానీ, వారి బతుకులు కన్నవారిని కలుసుకోకుండానే తెల్లారి పోయాయి. వారు ప్రయాణించిన హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు కూడా పూర్తిగా వారిని అభద్రతలోకే నెట్టేసింది. బస్సుకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. గమ్యస్థానానికి మరో మూడు గంటల సమయం ఉందనగా స్టీరింగ్ అదుపు తప్పి నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే అంటుకున్న మంటలు ప్రయాణికులను అగ్నికీలల్లో ముంచేశాయి. ఇన్ని వందల కిలోమీటర్ల మధ్య బస్సు ఫిట్‌నెస్‌ను ఒక్క అధికారి కూడా పరిశీలించక పోవడం ఇక్కడ ఆశ్చర్యకరం.



## ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### తదుపరి తమ లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరిక

**వాషింగ్టన్,మార్చి28:**

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపు తోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబా కు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.



# కెప్టెన్‌గా చరిత్ర సృష్టించనున్న ఇషాన్ కిషన్

వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ సారథ్యంలో సన్‌రైజర్స్ బరిలోకి దిగనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇషాన్ కిషన్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో అతడు ఓ అరుదైన రికార్డును అందుకోనున్నాడు.ఫస్ట్ మ్యాచ్‌లో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ టీమ్స్ తలపడనున్నాయి. అయితే సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయపడడంతో.. విధ్వంసరకర బ్యాటర్ ఇషాన్ కిషాన్ కెప్టెన్సీలో ఎస్ఆర్‌హెచ్ ఆడనుంది. ఇషాన్‌కి ఐపీఎల్ హిస్టరీలోనే ఫస్ట్ మ్యాచ్ ఇది. ఈ క్రమంలో ఈ స్టార్ బ్యాటర్ ఓ అరుదైన రికార్డును సృష్టించనున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహించిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించనున్నాడు. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 ఏళ్ల 253 రోజులు. ఇక ఓవరాల్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతి పిన్నవయసులో కెప్టెన్సీ వహించిన రికార్డు కివీస్ ఆటగాడు కేన్ విలియమ్సన్ పేరిట ఉంది. అతడు 27 ఏళ్ల 244 రోజుల వయసులో అంటే 2018లో ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించాడు. ఇప్పటి వరకు శిఖర్ ధావన్, మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ లు మాత్రమే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన భారత ఆటగాళ్లు. షాన్ కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించాలన్న జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం పై ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. అతడు ఆత్మవిశ్వాసం గల ఆటగాడని, నాయకుడిగా తనను తాను నిరూపించుకున్నాడని చెప్పుకొచ్చాడు.ఇషాన్ కిషన్ అండర్-19 జట్టుకు, దేశవాళీలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తన రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో నాయకుడిగా తన జట్టుకు టైటిల్ అందించాడు.

# ధోని అభిమానులకు బ్యాడ్ న్యూస్.. ఐపీఎల్ 2026 నుంచి అవుట్!

మహేంద్ర సింగ్ ధోని అభిమానులకు పిడుగు లాంటి వార్త. ఐపీఎల్ 2026 మరికొన్ని గంటల్లో ఆరంభం కానున్న తరుణంలో సీఎస్కే నుంచి షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ధోని పిక్క గాయం బారిన పడ్డట్లు పేర్కొంది. దాంతో అతడు ఐపీఎల్ 2026 తొలి రెండు వారాలకు ధోని దూరం అయినట్లు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదిక ద్వారా స్పష్టం చేసింది. ఈ రెండు వారాల పాటు అతడు పునరావాసంలో ఉండనున్నట్లుగా పేర్కొంది. ఇది ధోని అభిమానులకు బిగ్ షాక్ లాంటిదే. అతడు ఆడితే చూడాలనుకునే వారికి ధోని గాయం పెద్ద షాక్‌కు గురి చేసింది. గత కొన్ని రోజులుగా సీఎస్కే ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సెషన్స్‌లో ధోని చురుకుగా పాల్గొన్నాడు. భారీ షాట్స్ ఆడుతూ కనిపించాడు. అయితే తాజాగా ధోని గాయం బారిన పడటంతో రెండు వారాల పాటు ఐపీఎల్‌కు దూరం కావడం విచారకరం.ధోని గత కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. గత రెండు సీజన్లలో మోకాలి నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. 2024 సీజన్‌లో అయితే గాయంతోనే ఐపీఎల్ ఆడాడు. అనంతరం మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. 2025లో ఎటువంటి గాయం లేకపోవడంతో 2024 కంటే కూడా ఫిట్‌గా కనిపించాడు. అయితే ఇప్పుడు పిక్క గాయం బారిన



పడటంతో అతడి అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ధోని వయసు 44 ఏళ్లు. ఈ ఏజ్‌లో క్రికెట్ లాంటి గేమ్స్ ఆడటం శరీరాన్ని త్వరగా అలసిపోయేలా చేస్తుంది. ప్రస్తుతానికి ధోని కేవలం రెండు వారాల ఆటకు మాత్రమే దూరమైనట్లుగా సీఎస్కే తన ట్వీట్‌లో పేర్కొంది. అయితే వయసును పరిగణలోకి తీసుకుంటే అది కష్టమనే చెప్పాలి. సీఎస్కే తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 3న ఆడనుంది. రెండు వారాల్లో అతడు కోలుకుంటే ఏప్రిల్ 11 లేదా 14న జరిగే మ్యాచ్‌తో అతడు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సీఎస్కే మేనేజ్‌మెంట్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి అతడు తన టీమ్ ఆడే తొలి 3 మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది.టీమిండియా తరఫున మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గాడు. ప్రస్తుతం 44 ఏళ్లు. ధోనికి క్రికెట్‌లో సాధించాల్సింది ఏముంది? ఏం లేదు.. హాయిగా రిటైర్మెంట్ ఇవ్వకుండా తన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడం ఎందుకు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# రోహిత్ శర్మను చూసి ఆశ్చర్యపోయిన నీతా అంబానీ

ముంబై ఇండియన్స్ శిక్షణ శిబిరంలో ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో జట్టు యజమాని నీతా అంబానీ ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించడానికి వచ్చారు. అక్కడ రోహిత్ శర్మను చూడగానే ఆమె ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. రోహిత్ గతంతో పోలిస్తే చాలా బరువు తగ్గడమే కాకుండా, ఎంతో చురుగ్గా కనిపిస్తున్నారు. ఆయనను చూడగానే నీతా అంబానీ స్పందిస్తూ.. "మై గాడ్ రోహిత్! నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు అచ్చం ఒక కుర్రాడిలా కనిపిస్తున్నావు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోను ముంబై ఇండియన్స్ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకుంది. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది వ్యూస్ సాధించింది. రోహిత్



శర్మ తన ఫిట్‌నెస్‌పై పెట్టిన శ్రద్ధను చూసి నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 2026 సీజన్ కోసం రోహిత్ మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా ఎంతో సిద్ధంగా ఉన్నారని ఈ వీడియో స్పష్టం చేస్తోంది.ముంబై ఇండియన్స్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. సొంత మైదానమైన వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ పోరులో రోహిత్ శర్మ కొత్త అవతారంలో బరిలోకి దిగనున్నాడు. గత సీజన్లలో ఫిట్‌నెస్‌పై వచ్చిన విమర్శలకు సమాధానం చెబుతూ, ఈసారి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని రోహిత్ కృతనిశ్చయంతో ఉన్నాడు. హార్దిక్ పాండ్యా సారథ్యంలో రోహిత్ ఓపెనర్‌గా జట్టుకు ఎలాంటి ఆరంభాన్ని ఇస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ముంబై జట్టు ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలవడంలో రోహిత్ పాత్ర ఎంతో కీలకం. ఇప్పుడు సారథ్య బాధ్యతలు లేకపోయినా, ఒక సీనియర్ ఆటగాడిగా జట్టును నడిపించే బాధ్యత ఆయనపై ఉంది. నీతా అంబానీ అన్నట్లుగా, రోహిత్ మళ్ళీ తన కెరీర్ ఆరంభ రోజుల్లో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. ఈ కొత్త ఉత్సాహంతో హిట్ మ్యాన్ మైదానంలో సిక్సర్ల వర్షం కురిపిస్తారని ముంబై పల్టాన్ ఆశిస్తోంది.

# తొలి మ్యాచ్‌కు విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌లు దూరం



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌కు సిద్ధమైంది. ఆదివారం తమ సొంత మైదానం వాంఖడే వేదికగా జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో అమీతుమీ తేల్చుకోనుంది. గత ఐదేళ్లుగా టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ముంబై ఇండియన్స్.. ఈ సారి ఆ కల నెరవేర్చుకోవాలనే కసితో ఉంది. వేలానికి ముందే ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా జట్టును పటిష్టం చేసుకుంది. ఆన్‌పేపర్‌పై ముంబై ఇండియన్స్ మిగతా 9 జట్ల కంటే పటిష్టంగా ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా వంటి మ్యాచ్ విన్నర్లతో భీకరంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే క్రికెట్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు ఏఐ ఫ్లాట్ ఫామ్స్ అన్నీ ముంబై ఇండియన్సే విజేతగా నిలుస్తుందని జోస్యం చెప్పాయి. గతేడాది ప్లే ఆఫ్స్ చేరినా.. ఫైనల్ చేరకుండానే హార్దిక్ సేన టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే ఈ సీజన్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజేతగా నిలవాలనే పట్టుదలతో ముంబై ఇండియన్స్ ఉంది. అయితే స్టార్ ఆల్‌రౌండర్స్ విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌లు కేకేఆర్‌తో తొలి మ్యాచ్‌కు దూరంగా ఉండనున్నారు. ఈ ఇద్దరూ ఇంకా ముంబై ఇండియన్స్ జట్టుతో కలవలేదు. సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన సాంట్నర్.. చివరి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. అతను ఇంకా ముంబై ఇండియన్స్ జట్టులో చేరలేదు. ఎప్పుడు చేరుతారనే విషయంపై క్లారిటీ లేదు.మరోవైపు విల్ జాక్స్ వ్యక్తిగత కారణాలతో ఇంకా భారత్‌కు రాలేదు. ఈ ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ ఇద్దరి గైర్హాజరీ ముంబై ఇండియన్స్‌కు గట్టి ఎదురు దెబ్బే. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం వీరికి ఉంది. సాంట్నర్ స్థానంలో అఫ్గాన్ మిస్టరీ స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్ ఆడనుండగా.. విల్ జాక్స్ స్థానంలో మయాంక్ మార్కండేను ఆడించవచ్చు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్ ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. ర్యాన్ రికెల్టన్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. సూర్య, తిలక్ వర్మ, నమన్ ధీర్ మిడిలార్డర్‌లో ఆడనుండగా.. హార్దిక్ పాండ్యా ఫినిషర్ పాత్ర పోషించనున్నాడు. మయాంక్ మార్కండే, అల్లా గజన్‌ఫర్ స్పిన్నర్లుగా ఆడనుండగా.. దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఇంపాక్ట్ ప్లేయర్లుగా అశ్వని కుమార్, అథర్వ అంకోలేకర్, ర్యాన్ రికెల్టన్‌లో ఒకర్ని ఆడించవచ్చు. కేకేఆర్‌తో ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా)రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్/ర్యాన్ రికెల్టన్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, నమన్ ధీర్, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), మయాంక్ మార్కండే, దీపక్ చాహర్, అల్లా గజన్‌ఫర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్.ముంబైఇండియన్స్ పూర్తి జట్టు:రోహిత్ శర్మ, డికాక్, తిలక్ వర్మ, సూర్యకుమార్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, డానిష్ మలేవార్, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, శాంట్నర్, రాజ్ బజ్వా, కార్బిన్ బాష్, శార్దూల్, మయాంక్ రావత్, అథర్వ అంకోలేకర్, రాబిన్ మిన్జ్, రికెల్టన్, నామన్ ధిర్, బుమ్రా, దీపక్ చాహర్, అశ్వనీ కుమార్, బౌల్ట్, మహ్మద్ ఇజార్, అల్లా ఘజన్ఫర్, రఘు శర్మ, మార్కండే.

# ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ గ్రీన్ సిగ్నల్

గత ఏడాదిన్నర కాలంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి 'క్రికెట్ దౌత్యాన్ని' ఆయుధంగా ఎంచుకుంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాలపై ఉన్న అడ్డంకులను తొలగించింది. ఈ నిర్ణయం ద్వారా ఇరు దేశాల మధ్య మళ్లీ క్రికెట్ సంబంధాలు బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ నూతన సమాచార, ప్రసార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వపన్ శనివారం ఈ కీలక ప్రకటన చేశారు. ఐపీఎల్ ప్రసారాలను తాము అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ఛానల్ లేదా బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. క్రీడలను, రాజకీయాన్ని వేర్వేరుగా చూడాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ తమ దేశంలో మ్యాచ్‌లను చూపిస్తే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు విడుదల చేయడంతో పెద్ద దుమారం రేగింది. అప్పట్లో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణించి భారత్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగానే ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేయడంతో పాటు, భారత్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో కూడా బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకుండా అడ్డుకుంది. దీనివల్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భారీగా నష్టపోయింది.బంగ్లాదేశ్ ప్రభుత్వ తాజా నిర్ణయంతో అక్కడ ఉన్న లక్షలాది మంది ఐపీఎల్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 19వ సీజన్ ప్రారంభం రోజే ఈ అనుమతి రావడం విశేషం. ఇది కేవలం ప్రసారాలకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్లలో బంగ్లాదేశ్ ఆటగాళు మళ్లీ ఐపీఎల్ జట్లలో చేరడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు.

# నా కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లినే..

● తెలుగు ఇన్‌ఫ్లూయెన్సర్ షాకింగ్ వీడియో




సోషల్ మీడియా వచ్చిన తర్వాత చాలా మంది రీల్స్ పిచ్చితో పిచ్చి పిచ్చి వేషాలు చాలానే వేస్తున్నారు. లైకులు పిచ్చితో కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంటే మరికొంతమంది చిత్రవిచిత్రమైన పనులు చేస్తుంటారు. అవి చూస్తే కొన్నిసార్లు నవ్వు వస్తుంది కానీ చాలా సార్లు చిరాకు కూడా వస్తుంది. అలాంటి వీడియోనే ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ చాలా మంది రకరకాలుగా పాపులర్ అవుతుంటారు. కొందరు గ్లామర్ తో మరికొంతమంది కామెడీతో, ఇంకొంతమంది తమ యాక్టింగ్ స్కిల్స్ తో క్రేజ్ తెచ్చుకుంటుంటారు, వీరందరి కంటే ఎక్కువ మంది క్రింజ్ తో పాపులర్ అవుతుంటారు. ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్న ఓ వీడియో. ఓ అమ్మాయి తన కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అంటూ వీడియోలు చేసి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడని వీడియోలు చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది ఆమె.. ఆమె పేరు పెద్దగా ఎవ్వరికీ తెలియదు కానీ.. సోషల్ మీడియాలో గతంలో స్వేయ్ గర్ల్ పేరుతో వీడియోలు చేసేది. క్రికెటర్ విరాట్ కోహ్లీకి వీరాభిమాని అయిన ఆమె ఎక్కువగా ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ వీడియోలు చేసేది. ప్రతి ఐపీఎల్ సీజన్ కు రకరకాల వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యింది. కొంతమంది ఆర్సీబీ ఫ్యాన్స్ కూడా ఈ అమ్మడికి తెగ సపోర్ట్ చేస్తుంటారు. ఇంతవరకూ బాగానేఉంది .. కానీ రీసెంట్ గా ఆమె తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అని చెప్పి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడు అని కూడా చెప్పుకుంటూ వీడియో చేసింది. ఈ వీడియో వైరల్ అవ్వడంతో కోహ్లీ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. ఈ పాపులారిటీ కోసం మా అభిమాన క్రికెటర్ పేరు చెడగొడతావా.? అంటూ ఫైర్ అవుతున్నారు.



# వాలీబాల్ నేపథ్యంలో వరుణ్ తేజ్ 'బరి'

# క్లాప్ కొట్టిన పవన్ కల్యాణ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమా శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. 'బరి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు .హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ వేడుక జరిగింది. ఈ సినిమాకు వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. తన సొంత



నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదువంశీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలోని వాలీబాల్ క్రీడ ఆధారంగా ఈ సినిమాను హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' అనే హారర్ కామెడీ సినిమా షూటింగ్‌లో చివరి దశలో ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే 'బరి' చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 2027 సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

## వెంకటేశ్, కల్యాణ్‌రామ్‌తో
# అనిల్ రావిపూడి కొత్త సినిమా!



వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్టును ప్రకటించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'భగవంత్ కేసరి', 'మన శంకర వర ప్రసాద్ గారు' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న మరో భారీ చిత్రమిది. సురేశ్ ప్రొడక్షన్స్, అర్చన ఈ సినిమాను సమర్పిస్తుండగా, జీ స్టూడియోస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. ఈ ప్రాజెక్టుకు తాత్కాలికంగా అనే వర్కింగ్ టైటిల్స్ పెట్టారు.వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఇది ఐదో సినిమా కావడం విశేషం. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన »F2», »F3', 'సంక్రాంతికి వస్తున్నాం', »MSG» వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. అలాగే, 'పటాస్' వంటి సూపర్ హిట్ తర్వాత కల్యాణ్ రామ్‌తో అనిల్ రావిపూడికి ఇది రెండో సినిమా. దీంతో ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు భారీగా పెరిగాయి.

ఈ సినిమాను పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నట్టు చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించనున్నారు.



# కొలిక్కిరాని వివాదం..
## 'జననాయగన్' మరోసారి రిలీజ్ వాయిదా?

తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన చిత్రం 'జననాయగన్'. నిజానికి ఈ సినిమా ఈ జనవరిలోనే విడుదల కావాల్సింది. కానీ, కొన్ని కారణాల వల్ల సినిమా విడదుల వాయిదా పడుతూ వస్తుంది. తాజ నివేదికల ప్రకారం ఈ సినిమా విడుదల మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. విజయ్ పుట్టినరోజున ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. జూన్ 22న హీరో పుట్టినరోజు కావడంతో ఈ సినిమాను జూన్ 18వ తేదీన విడుదల చేస్తారని అంతా భావించారు. అయితే ఈ తేదీకి కూడా సినిమా రావడం కష్టమే అని తెలుస్తోంది. ఈ సినిమాను నిర్మించిన కెవిఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో యశ్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా ఒకటి. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. దీంతో జులైలో 'జననాయగన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.



# పట్టు పరికిణిలో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య!

వైష్ణవి చైతన్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఆమె పట్టు పరికిణి ధరించి దిగిన ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో ఆమెను చూడటం తమకు ఎంతో ఇష్టమని ఫాలోయర్స్ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఫోటోలతోనే కాకుండా, తన కళ్ళతోనే హావభావాలను పలికిస్తూ కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే వైష్ణవి తన తదుపరి సినిమాల కోసం ఎంతగా సిద్ధమవుతుందో అర్థమవుతోంది ఆనంద్ దేవరకొండతో మరో క్రేజీ ప్రాజెక్ట్: కెరీర్ విషయానికి వస్తే, వైష్ణవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత మళ్ళీ ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఏ పిక్' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటించి మెప్పించిన ఈ భామ, ఇప్పుడు ఈ కొత్త సినిమాతో తన సక్సెస్ గ్రాఫ్‌ను మరింత పెంచుకోవాలని చూస్తోంది.ూశ్రీంశీ =ఠ్మీఇ -
లగాన్..దంగల్..బుచ్చిబాబు భలే ప్లాన్ చేశాడే! కోలీవుడ్‌లోనూ వైష్ణవి హవా.. వరుస ఆఫర్లు: వైష్ణవి క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. ఇప్పుడు పక్కనే ఉన్న కోలీవుడ్‌లోనూ ఈమె పేరు మారుమోగుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఒక క్రేజీ ప్రాజెక్టులో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే హీరో విష్ణు విశాల్ సరసన మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. ఇవే కాకుండా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తోంది

# కరుప్పుపై భారీ హైప్.. టెన్షన్ లో ఫ్యాన్స్


సూర్య నటించిన కరుప్పు సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇది సూర్య కెరీర్‌లో ఒక కీలక మలుపుగా మారుతుందా అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. గత కొన్ని సినిమాలుగా ఆయన చేసిన ప్రయోగాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, ఫ్యాన్స్ కోరుకునే సూర్య మాత్రం కనిపించలేదనే భావన ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు ఆ లోటును తీర్చగలదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారిందిఈ సినిమాను కేవలం కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే కాకుండా, ఒక స్పష్టమైన సోషల్ మెసేజ్ తో తెరకెక్కించినట్లు చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో హీరోలను ఎక్కువగా రౌడీలు లేదా పోలీసులుగా చూపించే ట్రెండ్ పెరిగిందని, దీంతో పాత్రల్లో సహజత్వం, వైవిధ్యం తగ్గిపోయిందని బాలాజీ అభిప్రాయపడుతున్నారు. కరుప్పు ద్వారా సాధారణ మనుషుల కథలను, రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలను తెరపైకి తీసుకురావడానికి బాలాజీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.



## ప్రభాస్ సినిమాలో రోల్..
# విమర్శలపై స్పష్టత ఇచ్చిన నటి రాశి

ప్రభాస్ సినిమాలో నటించడంపై తాను చేసిన వ్యాఖ్యల గురించి సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై సీనియర్ నటి రాశి స్పందించారు. ప్రభాస్‌కు తల్లి పాత్రలో తప్ప మరే ఇతర పాత్రలోనైనా నటించడానికి సిద్ధమేనని, సోదరి పాత్ర చేయనని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ అంటే ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా మాత్రం నటించనని రాశి చెప్పిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ప్రభాస్ సినిమాలకు గతంలో డబ్బింగ్ చెప్పినా, ఆయన్ను కలవలేకపోయానని కూడా ఆమె గతంలో పేర్కొన్నారు.

'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా 'అనుమాన పక్షి' తెరకెక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి వినగానే ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకున్నానని రాశి తెలిపారు. హీరోయిన్‌గా 148 సినిమాలు చేశానని, ఆ అనుభవంతో ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది ధీమాగా చెబుతున్నానన్నారు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613